క్లుప్తంగా

గండేపల్లి పాఠశాలలో 78శాతం ఉత్తీర్ణత

గండేపల్లి(కంచికచర్ల) : మండలంలోని గండేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో విజయదుందుభి మోగించారని ప్రధానోపాధ్యాయులు చావా రామకృష్ణ గురువారం తెలిపారు. తమ పాఠశాల విద్యార్థులు 78శాతం ఉత్తీర్ణత సాధించినట్లు వివరించారు. పాఠశాలకు చెందిన ఏడుగురు విద్యార్థులు 500కుపైగా మార్కులు సాధించారన్నారు. అత్యుత్తమ మార్కులు సాధించిన ఎంవీ ఆంజనేయప్రసాద్ (546), బెల్లంకొండ లంకరేశ్వర్ (539), షేక్ హాసిని (531), షేక్ నాజియా(521), తలమాల అనూష(511), కృష్ణా త్రినాథ్(510), బొక్కా జాయ్‌బాబు(508)లకు అభినందనలు తెలిపారు. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను సర్పంచి బొక్కా రవికుమార్, ఎంపీటీసీ సభ్యులు పిల్లి భాగ్యలక్ష్మి, ఉపసర్పంచి బీ సుబ్బారావు, పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ డోగిపర్తి శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ యరగొర్ల పద్మావతి, ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేశారు.

హోమియో మందుల పంపిణీ

నందిగామ: పట్టణానికి చెందిన సత్య దివ్యాంగుల సేవాసమితి ఆధ్వర్యంలో గురువారం వడదెబ్బ నివారణకు హోమియో మందులు పంపిణీ చేశారు. మండలంలోని మునగచర్ల పరిసర ప్రాంతాలలో పనిచేస్తున్న 500 మంది వ్యవసాయ కూలీలకు ఉచితంగా హోమియో మందులు పంపిణీ చేశారు. సేవా సమితి నిర్వాహకుడు రామిరెడ్డి కోటి సూర్యం పాల్గొన్నారు.

కొనసాగుతున్న కల్యాణ మహోత్సవాలు



తిరుమలగిరి(జగ్గయ్యపేట): ప్రముఖ పుణ్య క్షేత్రం వెంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు తిరునగరి రామకృష్ణమాచార్యులు, పర్యవేక్షణలో సప్తకలశ స్నాపనం, హోమం, బలిహరణ, వసంతోత్సవం, చక్రతీర్థం, మహానివేదన కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌చార్జి ఈవో నూతక్కి సాంబశివరావు, ఆలయ సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రక్రియ పరిశీలన



నందిగామ: నందిగామ, మైలవరం, జగ్గయ్యపేట అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల సాధారణ పరిశీలకులు నరేందర్‌సింగ్ బాలి గురువారం నందిగామకు వచ్చారు. నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ.రవీంద్రరావుతో ఎన్నికలకు సంబంధించి పలు అంశాలపై చర్చించారు. ముఖ్యంగా నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ, ఎన్నికల నిర్వహణకు చేసిన ఏర్పాట్లపై ఆర్‌ఓతో చర్చించారు. అనంతరం స్థానిక కె.వి.ఆర్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌ను ఆయన పరిశీలించారు. ఆయన వెంట ఎన్నికల, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

ఏరులై పారిన మద్యం



జగ్గయ్యపేట అర్బన్: టీడీపీ అభ్యర్థి శ్రీరాం తాతయ్య నామినేషన్ దాఖలు సందర్భంగా జగ్గయ్యపేట పట్టణంలో గురువారం మద్యం ఏరులై పారింది. నామినేషన్ కార్యక్రమానికి హాజరయ్యే మద్యం అలవాటు లేనివారికి రూ.300 చొప్పున, మద్యం అలవాటు ఉన్నవారికి మద్యం సీసాతోపాటు రూ.200 నగదు, బైక్ ఉంటే పెట్రోలు కోసం అదనంగా మరో రూ.100 చెల్లిస్తామంటూ జనాన్ని తరలించినట్లు సమాచారం. నామినేషన్ సందర్భంగా పట్టణంలోని మద్యం దుకాణాలు, బార్ అండ్ రెస్టారెంట్‌ల వద్ద బైక్‌లకు టీడీపీ జెండాలు కట్టుకున్న మందుబాబులు బారులుతీరారు. రోడ్లపైనే మద్యం సేవిస్తూ పలువురు టీడీపీ కార్యకర్తలు హడావుడి చేయడంపై పట్టణ ప్రజలు అసహనం వ్యక్తంచేశారు. జగ్గయ్యపేటలో బుధవారం వైఎస్సార్ సీపీ అభ్యర్థి సామినేని ఉదయభాను నామినేషన్ కార్యక్రమానికి సుమారు 25వేల మంది పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు తరలివచ్చిన నేపథ్యంలో తాతయ్య నామినేషన్ కార్యక్రమానికి జనాన్ని భారీగా తరలించేందుకు యత్నించినప్పటికీ ఆశించిన మేర స్పందన కరువైందని ఆపార్టీ నాయకుల నుంచే గుసగుసలు వినిపించాయి. మహిళలకు రూ.300 ఇస్తామని నామినేషన్ కార్యక్రమానికి రప్పించి, చివరికి రూ.200 మాత్రమే చెల్లించడంపై టీడీపీ నాయకులపై పలువురు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడం గమనార్హం.

ముగిసిన నామినేషన్ల పర్వం



నందిగామలో వైఎస్సార్‌సీపీ తరఫున నామినేషన్ దాఖలు చేస్తున్న డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు సతీమణి పెద్దాడ రమాదేవి



జగ్గయ్యపేటలో ఆర్‌ఓ వెంకటేశ్వర్లుకు నామినేషన్ పత్రాలు అందజేస్తున్న స్వతంత్ర అభ్యర్థి వేల్పుల విజయ్



జగ్గయ్యపేటలో సామినేని ఉదయభాను తరఫున నామినేషన్ వేస్తున్న ఆయన సోదరుడు రవిచంద్, ఇంటూరి చిన్నా

- జగ్గయ్యపేటలో మొత్తం 39నామినేషన్లు
- చివరిరోజున 11నామినేషన్లు దాఖలు
- నందిగామలో చివరిరోజున 16 నామినేషన్లు
- మొత్తం 24 నామినేషన్లు వేసిన అభ్యర్థులు

జగ్గయ్యపేట అర్బన్, నందిగామ: సార్వత్రిక ఎన్నికల్లో తొలి ఘట్టమైన నామినేషన్ల దాఖలు పర్వం ముగిసింది. జగ్గయ్యపేట నియోజకవర్గానికి సంబంధించి చివరిరోజున గురువారం 11నామినేషన్లు దాఖలు కాగా, మొత్తం 39సెట్ల నామినేషన్లు దాఖలైనట్లు రిటర్నింగ్ అధికారి జి.వెంకటేశ్వర్లు తెలిపారు. చివరిరోజున వైఎస్సార్ సీపీ అభ్యర్థి సామినేని ఉదయభాను తరఫున సామినేని రవిచంద్ నామినేషన్ దాఖలు చేయగా, సామినేని విమల తరఫున మున్సిపల్ మాజీ చైర్మన్ ఇంటూరి రాజగోపాల్ (చిన్నా) నామినేషన్ వేశారు. తెలుగు దేశం పార్టీ తరఫున శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య), జాతీయ జనసేన పార్టీ అభ్యర్థులుగా చిల్లకల్లు గ్రామానికి చెందిన శ్రీరాం రామకృష్ణ తమ నామినేషన్‌పత్రాలను రిటర్నింగ్ అధికారికి అందజేశారు. వత్సవాయి మండలం, మంగొల్లు గ్రామానికి చెందిన అన్నెపాక రత్నం, జగ్గయ్యపేటకు చెందిన చేకూరి గోపినాథ్, దాసరి రవికుమార్, పెనుగంచిప్రోలు మండలం ముచ్చింతాలకు చెందిన బేరతుల ప్రకాశరావు, మంగొల్లు గ్రామానికి చెందిన కందుల నరసింహారావు, చిల్లకల్లు గ్రామానికి చెందిన వేల్పుల విజయ్, ఎస్.దుర్గాభవాని స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్ దాఖలు చేశారు.

నందిగామలో..

నందిగామ నియోజకవర్గంలో నామినేషన్లు దాఖలు గడువు ముగిసే సమయానికి మొత్తం 24 నామినేషన్లు దాఖలయ్యాయని ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ.రవీంద్రరావు తెలిపారు. చివరిరోజైన గురువారం భారీసంఖ్యలో మొత్తం 16 నామినేషన్లు దాఖలయ్యాయి. వైఎస్సార్ సీపీ తరఫున ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు సతీమణి పెద్దాడ రమాదేవి రెండు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. సమాజ్‌వాది పార్టీ తరఫున కటారపు శాంతారావు నామినేషన్ వేయగా, కాంగ్రెస్ తరఫున మంద వజ్రయ్య రెండు సెట్ల నామినేషన్లు వేశారు. టీడీపీ తరఫున తంగిరాల సౌమ్య మూడోసెట్ నామినేషన్ దాఖలు వేయగా, తంగిరాల శ్రావణ్‌కుమార్ నామినేషన్ దాఖలు చేశారు. నవరంగ్ కాంగ్రెస్ పార్టీ తరఫున చింతమాల శాస్త్రి, తెలుగు రాజ్యాధికార పార్టీ నుంచి బర్రె శ్రీనివాసరావు, బీఎస్పీ నుంచి బర్రె ఉదయ్‌కిరణ్, కొంక విఘ్నేశ్వరరావు, జైమహాభారత్ పార్టీ తరఫున పనితీలాల్, జనవాహిని పార్టీ అభ్యర్థిగా బొక్క శ్రీనివాసరావు నామినేషన్ దాఖలు చేశారు. స్వతంత్ర అభ్యర్థులుగా తంగిరాల సౌమ్య, నిప్పులపల్లి కోటేశ్వరరావు, కట్టా శ్రీరాములు తమ నామినేషన్లు దాఖలు చేశారు.

నేడు నామినేషన్ల పరిశీలన..

అభ్యర్థులు వేసిన నామినేషన్ల పరిశీలన కార్యక్రమం శుక్రవారం నిర్వహిస్తామని జగ్గయ్యపేట, నందిగామ రిటర్నింగ్ అధికారులు జి.వెంకటేశ్వర్లు, ఎ.రవీంద్రరావు తెలిపారు. నిబంధనలకు అనుగుణంగా ఉన్న నామినేషన్లను ఆమోదిస్తామన్నారు. 27వతేదీ నుంచి 29వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంటుందన్నారు. ఆయా నియోజకవర్గాల్లో ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థుల జాబితాను అదేరోజున ప్రకటిస్తామని వారు వివరించారు.

ప్రజలకు ధన్యవాదాలు



ఉదయభాను



జగన్‌మోహనరావు

జగ్గయ్యపేట అర్బన్, నందిగామ టౌన్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జగ్గయ్యపేట, నందిగామ ఎమ్మెల్యే అభ్యర్థులుగా తాము నామినేషన్ దాఖలు వేసే కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతిఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు విప్ సామినేని ఉదయభాను, నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు గురువారం తెలిపారు. మండుటెండను సైతం లెక్కచేయకుండా నామినేషన్ కార్యక్రమానికి వేలాదిగా తరలివచ్చిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలకు ఈసందర్భంగా ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. మరోసారి అండగా నిలిచి ఈ ఎన్నికల్లో మరోసారి తమ గెలుపునకు సహకరించాలని వారు ప్రజలను కోరారు.

నేడు ఇందిరాకాలనీలో ప్రచారం

కంచికచర్ల : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నందిగామ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు శుక్రవారం ఇందిరాకాలనీలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు వేమా సురేష్‌బాబు గురువారం తెలిపారు. ఎన్నికల ప్రచార కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పాల్గొనాలని ఆయన కోరారు.

నిరుపేదలకు అండగా సీఎం జగన్



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు, నాయకులు



వీఅన్నవరంలో డాక్టర్ జగన్‌మోహనరావుతో కరచాలనం చేసేందుకు పోటీపడుతున్న యువత



కంచికచర్లలో డాక్టర్ జగన్‌మోహనరావును ఆశీర్వదిస్తున్న మహిళ

ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

వీరులపాడు: నిరుపేదలకు అండగా నిలిచిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని నందిగామ ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. మండలంలోని వీఅన్నవరం, దొడ్డదేవరపాడు, వీరులపాడు, పల్లెంపల్లి, కొణతాలపల్లి గ్రామాల్లో గురువారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. రానున్న ఎన్నికలలో సైతం అండగా నిలిచి ఫ్యాన్ గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. ఇంటింటి ప్రచారంలో భాగంగా ఆయా గ్రామాలలోని ప్రజలు హారతిచ్చి ఆత్మీయ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి తన ప్రజాసంకల్ప పాదయాత్ర, 2019 ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో 99శాతం హామీలను నెరవేర్చారని గుర్తుచేశారు. తమను ఆదరించి అక్కున చేర్చుకున్న మండల ప్రజలకు రుణపడి ఉంటామని తెలిపారు. రానున్న ఎన్నికలలో మరోసారి తనకు అండగా నిలిచి గెలిపించాలని కోరారు. ప్రచారంలో ఎంపీపీ కోటేరు లక్ష్మి, పార్టీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, సర్పంచ్‌లు జమ్ముల వరబాబు, చెండ్యాల రామకృష్ణ, కన్నమాల సురేష్ బాబు, నంద్రు సౌజన్య, ఎంపీటీసీ సభ్యులు తోట నారాయణరావు, అయిలూరి వెంకట్రావమ్మ, నాయకులు నువ్వుల విశ్వనాథం, ఇప్పల కృష్ణారెడ్డి, శీలం లక్ష్మీప్రసన్న, అయిలూరి నర్సిరెడ్డి, జంగా కోటిరెడ్డి, ఇప్పల సత్యనారాయణరెడ్డి, జమ్ముల శేష గిరిరావు, బేతు రాంబాబు, పెద్దసంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

కంచికచర్లలో..

కంచికచర్ల : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ పాలనలో ప్రజలందరికీ మేలు జరిగిందని, ఈ ఎన్నికల్లో అండగా నిలిచి తనను మరోసారి గెలిపించాలని ఆ పార్టీ నందిగామ ఎమ్మెల్యే అభ్యర్థి ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు కోరారు. కంచికచర్ల మోడల్‌కాలనీలో గురువారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. ఈ మేరకు డాక్టర్ జగన్‌మోహనరావు మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో ఓటర్లంతా ఫ్యాన్ గుర్తుపై ఓటేసి విజయవాడ పార్లమెంట్ ఎంపీ అభ్యర్థిగా కేశినేని శ్రీనివాస్(నాని), ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని ఓటర్లను కోరారు. నాలుగు దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న వసంత కాలనీ, ఇందిరాకాలనీ, హనుమాన్‌పేటలో ఇళ్లపైగల 33కేవీ హైటెన్షన్ విద్యుత్ వైర్ల సమస్యను తన హయాంలో పరిష్కరించినట్లు వివరించారు. కంచికచర్లకు మహిళా డిగ్రీ కళాశాలను మంజూరు చేయించినట్లు చెప్పారు. కంచికచర్ల అభివృద్ధి కోసం తమ పార్టీని ఆదరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రచారంలో పార్టీ మండల పట్టణ అధ్యక్షులు నన్నపనేని నరసింహారావు, వేమా సురేష్‌బాబు సొసైటీ అధ్యక్షుడు కాలవ పెదబాబు ఏఎంసీ వైస్ చైర్మన్ మాడుగుల శంకర్, దేవరకొండ గురవయ్య, నంబూరు పెదబాబు, అమర్లపూడి యోహాన్, దాసరి రాము, నారిశెట్టి శ్రీనివాసరావు, చట్టి రవీంద్ర, మేకల బాబు, శేషం మధుబాబు, ఆంజనేయులు, తంగిరాల సృజనీకుమార్, ఓర్సు నరసింహారావు, బండారుపల్లి శబరి, ఎం.పాండు, శివ, మంగినేని వెంకట్రామయ్య, గుగులోతు శివనాయక్, దూళ్ల సాయి యర్రంశెట్టి బాలయ్య పాల్గొన్నారు.

పేట వైఎస్సార్‌సీపీలో చేరికల జోష్



ఉదయభాను సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన గంద్రాయి గ్రామ టీడీపీ కార్యకర్తలు(ఫైల్)



తమ మొదటి ఓటు ఉదయభానుకేనంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తున్న యువతతో విప్ ఉదయభాను

పెనుగంచిప్రోలు: జగ్గయ్యపేట నియోజకవర్గంలో టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరుతున్న వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతుండటం ఆపార్టీ శ్రేణుల్లో జోష్‌ను మరింత పెంచుతోంది. ఆయా గ్రామాల నుంచి నిత్యం పదుల సంఖ్యలో చేరికలు ఉంటుండటంతో వైఎస్సార్ సీపీ నాయకులు నూతనోత్సాహంతో ముందుకు సాగుతున్నారు.

నియోజకవర్గంలో ఇప్పటివరకు 1000మందికి పైగా ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరగా, జగ్గయ్యపేట మండలంలోని గంద్రాయి గ్రామానికి చెందిన కనపర్తి శేషగిరిరావు ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను సమక్షంలో ఒకేరోజు 100 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరడం ఆపార్టీపై ప్రజల్లో రోజురోజుకు పెరుగుతున్న ప్రతిష్టతకు నిదర్శనమని చెప్పవచ్చు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సచివాలయ ఉద్యోగాలతో లక్షలాది ఇతర ఉద్యోగాలను సైతం భర్తీ చేయడంపై యువకులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. తొలిసారి ఓటుహక్కు పొందిన యువత అంతా వైఎస్సార్ సీపీకే అండగా ఉంటామంటూ జగ్గయ్యపేట అభ్యర్థి సామినేని ఉదయభానుకు బాహాటంగా మద్దతు ప్రకటిస్తుండటం వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో మరింత ఉత్సాహాన్ని పెంచిందని చెప్పవచ్చు.

ఘనంగా మారెమ్మ అమ్మవారి తిరునాళ్ల

విస్సన్నపేట: పుట్రేల గ్రామంలోని మారెమ్మ అమ్మవారి దేవస్థానంలో వార్షిక తిరునాళ్ల మహోత్సవం మూడో రోజు గురువారం కొనసాగింది. గురువారం జలబిందెలు, పూల కప్పెర, ఊరేగింపు కార్యక్రమాలు జరిగాయి. బుధవారం రాత్రి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. జానపద డప్పులు, కనకతప్పెట్లు, శక్తివేషాలు, విద్యుత్ కాంతులతో ప్రత్యేకంగా అలంకరించిన ప్రభలతో అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో గ్రామోత్సవంలో పాల్గొన్నారు.



ఉదయభానుకు మద్దతుగా ప్రచారం



మాచినేనిపాలెంలో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

వత్సవాయి : రానున్న ఎన్నికల్లో జగ్గయ్యపేట అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి సామినేని ఉదయభాను, విజయవాడ పార్లమెంట్ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్(నాని) విజయాన్ని కాంక్షిస్తూ వత్సవాయితోపాటు మాచినేనిపాలెం, పెంట్యాలవారిగూడెం, గోపినేనిపాలెం గ్రామాల్లో ఆపార్టీ నాయకులు గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు ఇంటింటికి వెళ్లి రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు నియోజకవర్గంలో ఉదయభాను చేసిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. ఈసందర్భంగా జెడ్పీటీసీ యేశపోగు దేవమణిశ్రీనివాస్, ఎంపీపీ కొలుసు రమాదేవి మాట్లాడుతూ పేదలకు సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావాల్సి ఉందన్నారు.

ఈ ఐదేళ్లలో వైఎస్సార్ సీపీ చేసిన మేలులను గుర్తుంచుకుని ప్రతి ఒక్కరూ పార్టీకి అండగా నిలవాలని ఓటర్లను అభ్యర్థించారు. ప్రచారంలో వత్సవాయి సొసైటీ అధ్యక్షులు రంగిశెట్టి ముత్తయ్య, మండల పార్టీ అధ్యక్షులు గాదెల రామారావు, వైస్ ఎంపీపీలు కాటేపల్లి రామలక్ష్మి, కొలికపోగు వెంకటేశ్వర్లు, సర్పంచులు భూక్యా సీతమ్మ, కర్నాటి రాధానారాయణరెడ్డి, ఉపసర్పంచి ధీరావత్ రెడ్యా నాయక్, భూక్యా రాజానాయక్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు బహుమతులు



ప్రతిభ చూపిన విద్యార్థులతో సర్పంచి లావణ్య, నాయకులు

ముండ్లపాడు(పెనుగంచిప్రోలు): పదోతరగతి పరీక్షా ఫలితాల్లో 500పైగా మార్కులు సాధించిన ముండ్లపాడు చెందిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులను గ్రామసర్పంచి గూడపాటి లావణ్య ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సత్కరించి నగదు బహుమతులను అందజేశారు. కోలా మహేష్(553), గొర్రెపాటి సృజల(549), దమ్ముల బేబి(505), మందా స్వరూపారాణి(503), కనపర్తి పూజిత(502)లకు పగడాల రామారావు ఒకొక్కరికి రూ.5 వేలు, పగడాల రవికుమార్ మొదటి ముగ్గురు విద్యార్థులకు వరుసగా రూ.10వేలు, రూ.6వేలు, రూ.4వేలు అందించారు. మందా స్వరూపారాణికి వైస్ ఎంపీపీ గుంటుపల్లి వాసు రూ.3వేలు, పూజితకు పేరెంట్స్ కమిటీ చైర్మన్ నరాల మధుసూధనరెడ్డి రూ.2వేలు నగదు ప్రోత్సాహకాన్ని అందజేసి అభినందించారు. ఈసందర్భంగా సర్పంచి లావణ్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు ఏరాష్ట్రంలో లేనివిధంగా ప్రాముఖ్యత ఇస్తున్నారన్నారు. పిల్లలకు మనమిచ్చే ఆస్తి విద్య మాత్రమేనని నమ్మి విద్యారంగ అభివృద్ధికి విశేషంగా కృషిచేయడంతో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించగలిగారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు గూడపాటి రవికుమార్, మాజీ ఎంపీపీ గూడపాటి శ్రీనివాసరావు, ఉపసర్పంచి గుత్తా శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు కూచి విష్ణు, చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

స్వరఝరి సంగీత కార్యక్రమాలను ఆదర్శంగా తీసుకోవాలి



సంగీత కచేరీ నిర్వహిస్తున్న విద్వాంసులు

విజయవాడకల్చరల్: స్వరఝరి సంస్థ నిర్వహించే సంగీత కార్యక్రమాలను ఆదర్శంగా తీసుకోవాలని సంగీత విద్వాంసుడు కొంమాండూరి శేషాద్రి అన్నారు. స్వరఝరి సంగీత సంస్థ 36వ వార్షిక వేడుకలు, సంగీత విద్వాంసులకు వార్షిక పురస్కారాలు, వాయిలీన త్రయం సంగీత కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. శేషాద్రి మాట్లాడుతూ స్వరఝరి సంగీత సేవలను కొనియాడారు. సంస్థ ప్రధాన కార్యదర్శి మోదుమూడి సుధాకర్ మాట్లాడుతూ క్రమం తప్పకుండా సంగీత కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా కొంమాండూరి శేషాద్రికి స్వరఝరి, చింతలపాటి రాజ్యలక్ష్మి స్మారక పురస్కారం, మృదంగ విద్వాంసురాలు దండమూడి సుమతీ రామ్మోనరావుకు లయ ప్రవీణ బిరుదును ప్రదానం చేశారు. సంగీత కార్యక్రమంలో భాగంగా కొంమాండూరి శేషాద్రి, కొంమాండూరి అనంత శౌరిరాజన్, డాక్టర్ కొంమాండూరి వెంకటకృష్ణ వయోలిన్‌పై శ్రీ రాఘవంతో ప్రారంభించి మహాగణపతిం, గాన మూర్తి, జ్ఞాన మొసగరాదా, దొరుకునా ఇటువంటి సేవ కీర్తనలను పలికించారు. బీవీఎస్ ప్రసాద్, ఎమ్ హరిబాబు వాద్య సహకారం అందించారు. కార్యక్రమంలో సంగీత విద్వాంసులు అంజనా సుధాకర్, వేమూరి విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గగుడిపై నేడు నూతన యాగశాలలో పూజలు



అందుబాటులోకి వచ్చిన యాగశాల

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై నూతనంగా నిర్మించిన యాగశాలలో శుక్రవారం పూజలు నిర్వహించనున్నారు. అమ్మవారి ఆలయం నుంచి మల్లేశ్వర స్వామి వారి ఆలయానికి చేరుకునే దారిలో రాధాకృష్ణుల విగ్రహం వద్ద సుమారు 250 గజాల్లో యాగశాల నిర్మించారు. రెండు నెలల్లో పూర్తైన యాగశాలను దాత సంగా నరసింహారావు రూ. 5 కోట్లతో నిర్మించారు. దీనికి అవసరమైన రాతి స్తంభాలు, చప్పురాయి, రాతి భీములు, పాదికలను క్వారీ వద్దే తయారు చేసి క్రేన్ సాయంతో కొండపైకి చేర్చారు. గురువారం యాగశాలను దుర్గగుడి ఈవో కె.ఎస్.రామరావు ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పనులను పరిశీలించారు. శుక్రవారం ఉదయం 10.45 గంటల సమయంలో యాగశాల ప్రారంభోత్సవం జరుగుతుందని ఆలయ అధికారులు పేర్కొన్నారు. యాగశాల తుది మెరుగులు దిద్దేందుకు చిన్నపాటి పనులు మిగిలి ఉండగా, మరో నాలుగు నెలల పాటు మంచి ముహూర్తాలు లేకపోవడంతో శుక్రవారం ముహూర్తాన్ని ఆలయ స్థానాచార్య, వైదిక కమిటీ ఖరారు చేసింది. దీంతో యాగశాల వద్ద పూజలకు ఏర్పాట్లు చేస్తున్నారు. మరో వైపున ఘాట్‌రోడ్డులోని సమాచార కేంద్రం వద్ద డోనర్ సెల్ భక్తులకు శుక్రవారం నుంచే అందుబాటులోకి రానుంది.

అదృశ్యమైన వ్యక్తి మృతి

పెనమలూరు: కొద్ది రోజుల క్రితం ఇంటి నుంచి అదృశ్యమైన వ్యక్తి గురువారం కృష్ణానదిలో శవమై తేలాడు. పెనమలూరు సీఐ టీవీవీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం ..తాడిగడప కార్మికనగర్‌కు చెందిన జక్కంపూడి నాగరాజు(29) అవివాహితుడు. హౌస్‌కీపింగ్ పని చేస్తాడు. అతని ఇంటి ఎదురుగా ఉండే లాల్‌బీ కోరిక మేరకు బంగారు చెవి బుట్టలు తాకట్టు పెట్టి డబ్బు తీసుకువచ్చి ఆమెకు ఇచ్చాడు. తాకట్టు పెట్టిన బంగారు చెవి బుట్టల విషయంలో ఆమెకు నాగరాజుకు మధ్య వివాదం తలెత్తడటంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ ఘటనపై పోలీసులు నాగరాజుపై కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో గత నెల 15 నుంచి నాగరాజు కనిపించలేదు. కాగా ఈ నెల 22న నాగరాజు సోదరికి వాట్సాప్ మెసేజ్ చేశాడు. బైక్, ఫోన్, లెటర్ ప్రకాశం బ్యారేజ్ వద్ద ఉంచానని మెసేజ్‌లో పేర్కొన్నాడు. దీంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన ప్రకాశం బ్యారేజీ వద్దకు వెళ్లి చూడగా బైక్, వస్తువులు ఉన్నాయి. అయితే నాగరాజు కనబడలేదు. దీంతో నాగరాజు తల్లి వరలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు. అతని కోసం గాలింపులు చర్యలు కొనసాగుతుండగా, గురువారం కృష్ణనదిలో శవమై కనిపించాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.